RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

హజ్ యాత్రకు భరోసా 2


| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 103 | మే 05 మంగళవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 103 | May 05 Tuesday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


## ఐదు రాష్ట్రాల్లో అనూహ్య ఫలితాలు

### అస్సాం, పుదుచ్చేరిల్లో పట్టును నిలుపుకున్న బీజేపీ... తమిళనాట విజయ్ సంచలనం.. కేరళంలో యూడీఎఫ్



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే విధంగా వెలువడ్డాయి. బిజెపి తన వ్యూహాలతో అస్సాం, పుదుచ్చేరిల్లో తన పట్టును నిలుపుకోవడమే కాకుండా, పశ్చిమ బెంగాల్‌లో సంచలన విజయాన్ని నమోదు చేసింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి షాక్ ఇస్తూ, మొత్తం 293 స్థానాలకు గాను దాదాపు 205 సీట్లలో బిజెపి స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోతోంది. అస్సాంలో కూడా బిజెపి తన జోరును కొనసాగిస్తూ, 126 స్థానాలకు గాను 100కు పైగా సీట్లతో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసుకుంది,

మిగతా 2వ పేజిలో..

## రాజ్యాంగం, ప్రజాస్వామ్యం మరింత బలోపేతం

- విజయోత్సవ సభలో ప్రధాని నరేంద్ర మోదీ



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం న్యూఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విజయోత్సవ సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు రాష్ట్రాల ఎన్నికల తీర్పు భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసిందని కొనియాడారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ సాధించిన విజయం చారిత్రాత్మకమని, ఇది పార్టీ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆత్మకు శాంతిని చేకూర్చుతుందని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. గంగానది, బ్రహ్మపుత్ర నదుల ఆశీర్వాదం వల్లే బెంగాల్, అస్సాంలలో ఈ విజయం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనడం ప్రజాస్వామ్యంపై వారికి ఉన్న నమ్మకానికి నిదర్శనమని ప్రధాని అన్నారు. సుపరిపాలన, అభివృద్ధి మంత్రంతోనే బీజేపీ ముందుకు సాగుతోందని, అందుకే గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు ప్రతిచోటా కమలం వికసించిందని చెప్పారు. అస్సాంలో హ్యాట్రిక్ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూనే, పుదుచ్చేరిలో

మిగతా 2వ పేజిలో..

## బంగారం ధరలు స్వల్పంగా తగ్గుముఖం



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

బంగారం మరియు వెండి ధరలు సోమవారం స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్ మరియు విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం 10 గ్రాములకు రూ. 1,50,920 వద్ద ఉండగా, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ. 1,38,340గా నమోదైంది. జాతీయ రాజధాని ఢిల్లీలో ధరలు పరిశీలిస్తే, అక్కడ 24 క్యారెట్ల పసిడి ధర 10

మిగతా 2వ పేజిలో..

## కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు తీవ్ర ఇబ్బందులు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం

**సదాశివపేట జనసంఘర్షణ**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో పర్యటించిన ఆయన, చేతికి వచ్చిన శనగ పంటను కొనుగోలు చేయకుండా నెల రోజులుగా రైతులను వేధిస్తుండటంపై మండిపడ్డారు. రైతు భరోసా సక్రమంగా అందించడం లేదని, అన్నీ కొంటామని చెప్పి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పంట సేకరణలో నెలకొన్న గందరగోళంపై ఆయన విరుచుకుపడ్డారు. దాదాపు 95 లక్షల మెట్రిక్ టన్నుల

మిగతా 2వ పేజిలో..



## తిరుపతిలో ఘోర ప్రమాదం

### నలుగురు స్పాట్ డెడ్

**తిరుపతి జనసంఘర్షణ**

తిరుపతి జిల్లాలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని అంబులెన్స్ బలంగా ఢీకొట్టడంతో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కోల్‌కతా నుంచి రోగిని మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని ఆసుపత్రికి తరలిస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న రోగితో పాటు ఆయనకు సహాయకులుగా వచ్చిన మరో ముగ్గురు మరణించారు. ప్రాథమిక సమాచారం మేరకు మృతులంతా

మిగతా 2వ పేజిలో..

## ఔటర్‌పై పక్కన నిలపడం నేరం

### హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక ఆదేశాలు

**హైదరాబాద్ జనసంఘర్షణ**

హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్ పై ప్రయాణించే వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల ఓఆర్ఆర్‌పై ఆగి ఉన్న వాహనాలను వెనుక నుంచి వేగంగా వచ్చే వాహనాలు ఢీకొంటున్న ఘటనలు, వాటి వల్ల జరుగుతున్న ప్రాణనష్టాన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకుని ఆయన ఈ హెచ్చరికలు చేశారు. బ్రేక్‌డౌన్, మెడికల్ ఎమర్జెన్సీ వంటి అత్యవసర పరిస్థితులు తప్ప, సెల్ఫీలు దిగడానికి లేదా విశ్రాంతి కోసం వాహనాలను రోడ్డు పక్కన నిలపడం చట్టరీత్యా నేరమని, ఇది అత్యంత ప్రమాదకరమని ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ

మిగతా 2వ పేజిలో..



## మమత బెనర్జీకి ఘోరం ఓటమి

**కలకత్తా జనసంఘర్షణ**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఊహించని సంచలనం నమోదైంది. అత్యంత కీలకంగా భావించిన ఈ అసెంబ్లీ ఎన్నికల్లో, ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ఘోర పరాభవం ఎదురైంది. తన సొంత నియోజకవర్గమైన భవానీపూర్‌లో ఆమె బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో 15 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓటమిని చవిచూశారు. దశాబ్ద కాలంగా అధికారాన్ని ఏలుతున్న తృణమూల్ కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల ఫలితాలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించాయి. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ప్రభంజనం సృష్టిస్తూ 200కు పైగా స్థానాల్లో విజయం దిశగా దూసుకుపోతుండగా, తృణమూల్ కాంగ్రెస్ కేవలం 70-80 స్థానాలకే పరిమితమై, పార్టీ ఉనికినే ప్రశ్నార్థకం చేసుకునే పరిస్థితికి చేరుకుంది. 2021లో నందిగ్రామ్ వేదికగా



మిగతా 2వ పేజిలో..

# ఐదు రాష్ట్రాల్లో అనూహ్య ఫలితాలు

**మొదటిపేజీ తరువాయి..** అక్కడ కాంగ్రెస్ 26 స్థానాలకే పరిమితమైంది. ఇక దక్షిణ భారతదేశంలో అనూహ్యమైన రాజకీయ మార్పులు చోటుచేసుకున్నాయి. తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ రాజకీయాలను మలుపు తిప్పింది. దశాబ్దాలుగా పాతుకుపోయిన ద్రవిడ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలను వెనక్కి నెట్టి, మొత్తం 234 స్థానాలకు గాను 104 చోట్ల ఆధిక్యంలో కొనసాగుతూ సంచలనం సృష్టించింది. ఇక్కడ డీఎంకే 62, అన్నాడీఎంకే 68 స్థానాల్లో మాత్రమే ముందంజలో ఉన్నాయి. మరోవైపు కేరళలో పదేళ్ల విరామం తర్వాత కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి అధికార పీఠాన్ని దక్కించుకుంది. మొత్తం 140 స్థానాలున్న కేరళ అసెంబ్లీలో యూడీఎఫ్ 100 సీట్లను కైవసం చేసుకోగా, ఎల్డీఎఫ్ 32 మరియు ఎన్డీయే 3 స్థానాలకు పరిమితమయ్యాయి. పుదుచ్చేరిలో కూడా ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. మొత్తం 30 స్థానాల్లో ఎన్ఆర్ కాంగ్రెస్ 9 స్థానాల్లో గెలిచి మరో 11 చోట్ల ఆధిక్యంలో ఉండగా, కాంగ్రెస్ 2 స్థానాల్లో గెలిచి 5 చోట్ల ముందంజలో ఉంది. మొత్తమ్మీద ఈ ఎన్నికల ఫలితాలు జాతీయ మరియు ప్రాంతీయ రాజకీయాల్లో కీలకమైన మార్పులకు నాంది పలికాయి.

# రాజ్యాంగం, ప్రజాస్వామ్యాం మరింత బలోపేతం

**మొదటిపేజీ తరువాయి..** ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పునరుద్ఘాటించారు. కేరళ, తమిళనాడులలో కూడా పోలింగ్ శాతం పెరగడాన్ని స్వాగతించిన ఆయన, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం నుంచి పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. తమిళనాడులో మంచి ప్రతిభ కనబరిచిన విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీని కూడా ఈ సందర్భంగా ప్రధాని అభినందించడం గమనార్హం. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లోనే ఇంతటి భారీ విజయం లభించడం పట్ల మోదీ సంతోషం వ్యక్తం చేశారు. బెంగాల్‌లో ఇక నుంచి భయాందోళనలు ఉండవని, అభ్యుదయ బెంగాల్ నిర్మాణానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. కేరళలో విజయం సాధించిన యూడీఎఫ్ కూటమికి శుభాకాంక్షలు తెలుపుతూనే, కేరళ వికాసం కోసం బీజేపీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా వంటి అగ్రనేతలు పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రాల సమగ్ర అభివృద్ధికి తమ కూటమి నిరంతరం శ్రమిస్తుందని ప్రధాని తన ప్రసంగంలో నొక్కి చెప్పారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు తీవ్ర ఇబ్బందులు

**మొదటిపేజీ తరువాయి..** వరి ధాన్యం సేకరించాల్సి ఉండగా, నామమాత్రంగా కేవలం 9 లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని గణాంకాలను ఎత్తిచూపారు. సరైన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం వెనుక ధాన్యాన్ని దళారులకు అప్పగించాలనే కుట్ర ఉందని, సివిల్ సప్లై కార్పొరేషన్‌లో జరిగిన భారీ కుంభకోణం కారణంగానే ఈ కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని ఆయన ఆరోపించారు. సీఎం మరియు మంత్రులు భూముల కొనుగోళ్లు, రియల్ ఎస్టేట్ లావాదేవీలపై చూపే శ్రద్ధను, రైతుల కష్టాలపైన ఎందుకు చూపడం లేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సదుపాయాలు లేక, ఎండలు, పిడుగులు మరియు గుండెపోటు వంటి కారణాలతో రైతులు ప్రాణాలు కోల్పోతుంటే ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ లేఖ ద్వారా రైతులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా పంటలను సేకరించిందని, సకాలంలో రైతుబంధు అందించి అన్నదాతలకు భరోసా కల్పించిందని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ ప్రస్తుత సర్కార్ వరి, జొన్నలు, శనగ పంటలకు కనీస మద్దతు ధర కూడా ఇవ్వకుండా రైతులను నిలువునా ముంచుతోందని దుయ్యబట్టారు. దీనిపై కేటీఆర్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. రాబోయే వారమంతా బీఆర్ఎస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతులకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాల వద్ద నిరసనలు తెలుపుతామని, పంట కొనుగోలు చేసే వరకు ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీసి, ఉక్కిరిబిక్కిరి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రైతులు ఎవరూ అధైర్యపడొద్దని, బీఆర్ఎస్ పార్టీ ప్రతి అడుగులోనూ తోడుగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

## కేరళలో చారిత్రాత్మక విజయం

### తమిళనాడు విజయంపై విజయ్‌కు రాహుల్ అభినందనలు

**న్యూఢిల్లీ, మే4 :** కేరళ ఓటర్లు నిర్ణయాత్మక తీర్పు అందించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తాను ఇంతకుముందు చెప్పినట్లుగా.. కేరళలో ప్రతిభ, సామర్థ్యాలు ఉన్నాయని.. ఇప్పుడు, ఆ రెండింటినీ సద్వినియోగం చేసుకునే యూడీఎఫ్ ప్రభుత్వం ఏర్పడనుందని తెలిపారు. త్వరలోనే కేరళకు వెళ్తానని 'ఎక్స్' వేదికగా చెప్పారు. తమిళనాడు ఫలితాల్లో టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించిన నేపథ్యంలో.. విజయ్‌కు రాహుల్ గాంధీ ఫోన్ చేసి అభినందించారు. 'టీవీకే అద్భుతమైన ఫలితం సాధించింది. పెరుగుతోన్న యువస్వరం ప్రాధాన్యాన్ని ఈ తీర్పు ప్రతిబింబిస్తోంది. ఇక్కడి ప్రజల ప్రయోజనాలు కాపాడే విషయంలో ఎప్పుడూ ముందుంటాం' అని తెలిపారు. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సత్తా చాటింది. 140 స్థానాలకుగానూ 102 కైవసం చేసుకుంది. దీంతో పదేళ్ల తర్వాత రాష్ట్రంలో మరోసారి అధికారం చేపట్టనుంది. మరోవైపు, తమిళనాడులో మొత్తం 234 స్థానాలు ఉండగా.. టీవీకే ఇప్పటివరకు 100కుపైగా స్థానాల్లో విజయం సాధించింది. పూర్తి ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది.

# తిరుపతిలో ఘోర ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..** పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. ప్రమాద తీవ్రతకు అంబులెన్స్ ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఈ ఘటనలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు.

డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న శ్రీకాళహస్తి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రమాదానికి గురైన వాహనాలను పోలీసులు తొలగించారు.

# బంగారం ధరలు స్వల్పంగా తగ్గుముఖం

**మొదటిపేజీ తరువాయి..** గ్రాములకు రూ. 1,51,220గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,38,490గా కొనసాగుతున్నాయి. వెండి విషయానికి వస్తే, దేశవ్యాప్తంగా కిలోకు సుమారు వంద రూపాయల మేర తగ్గుదల నమోదైంది. ప్రస్తుతం హైదరాబాద్ మరియు విజయవాడ నగరాల్లో కిలో వెండి ధర రూ. 2,69,900 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఢిల్లీ మరియు బెంగళూరు నగరాల్లో కిలో వెండి ధర రూ. 2,64,900గా ఉండగా, చెన్నై నగరంలో కిలో వెండి ధర రూ. 2,69,900గా కొనసాగుతోంది.

# ఔటర్‌పై పక్కన నిలపడం నేరం

**మొదటిపేజీ తరువాయి..** వాహనం సాంకేతిక సమస్యల వల్ల ఆగిపోతే, తక్షణమే 14449 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని కమిషనర్ సూచించారు. ఈ నంబర్‌కు సమాచారం అందించడం ద్వారా సంబంధిత సిబ్బంది తక్షణమే సహాయం అందించడమే కాకుండా, ఇతర వాహనదారులను అప్రమత్తం చేసేందుకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేస్తారని తెలిపారు. అత్యవసర పరిస్థితిలో వాహనాన్ని నిలపాల్సి వచ్చినప్పుడు, ఎట్టి పరిస్థితుల్లోనూ ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా ఎడమ వైపు ఉన్న చివరి లేన్‌లోనే పార్క్ చేయాలని పేర్కొన్నారు. వాహనం ఆపి ఉంచిన సమయంలో వెనుక నుంచి వచ్చే వారికి కనీసం 50 నుంచి 100 మీటర్ల దూరం నుంచే విషయం తెలిసేలా 'రిఫ్లెక్టివ్ ట్రయాంగిల్స్' లేదా ఇతర హెచ్చరిక గుర్తులను ఏర్పాటు చేయాలని సజ్జనార్ సూచించారు. వాహనం ఆగి ఉన్నంత సేపు ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు హజార్డ్ లైట్లు (నాలుగు ఇండికేటర్లు) ఆన్ చేసి ఉంచడం తప్పనిసరి అని తెలిపారు. ఔటర్ రింగ్‌రోడ్డుపై వాహనాల గరిష్ఠ వేగ పరిమితి గంటకు 120 కిలోమీటర్లుగా ఉన్న నేపథ్యంలో, ఒక్క చిన్న పొరపాటు కూడా భారీ ప్రాణనష్టానికి దారితీసే అవకాశం ఉందని, కాబట్టి ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించి తమ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మమత బెనర్జీకి ఘోరం ఓటమి

**మొదటిపేజీ తరువాయి..** సువేందు అధికారి చేతిలో ఎదురైన ఓటమిని గుర్తు చేస్తూ, ఇప్పుడు సొంత గడ్డపైనే మమత ఓడిపోవడం బెంగాల్ రాజకీయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. ఈ ఎన్నికల ఫలితాలపై మమతా బెనర్జీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇది ప్రజలు ఇచ్చిన తీర్పు కాదని, పూర్తిగా 'లూటీ' అని ఆమె ఆరోపించారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించడం లేదని, బీజేపీకి అనుకూలంగా పనిచేస్తూ 'బీజేపీ కమిషన్'గా మారిందని విమర్శించారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, దాదాపు 100 స్థానాలను బీజేపీ లాగేసుకుందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బలగాలు, కేంద్ర మంత్రుల అండతో ఈ అనైతిక విజయాన్ని సాధించారని, దీనిపై తాము చేసిన ఫిర్యాదులను అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ, తృణమూల్ కాంగ్రెస్ కుంగిపోదని, రాబోయే రోజుల్లో ప్రజాస్వామ్యబద్ధంగా మళ్లీ పుంజుకొని, అక్రమాలకు వ్యతిరేకంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు. మరోవైపు, ప్రధాని నరేంద్ర మోదీ ఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు కమలం వికసించిందని, బెంగాల్ ప్రజలు చారిత్రక తీర్పునిచ్చారని పేర్కొన్నారు. అసాధారణమైన ఈ విజయం పార్టీ కార్యకర్తల కృషితో సాధ్యమైందని ఆయన కొనియాడారు.

# హజ్ ఖర్చులను ప్రభుత్వం భరించేలా భరోసా

**హైదరాబాద్, మే4 :** తెలంగాణ ప్రభుత్వం హజ్ యాత్రికులకు గుడ్ న్యూస్ తెలిపింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో హజ్ యాత్ర ఖర్చులు భారీగా పెరిగాయి. ఈ అదనపు భారాన్ని పేద ముస్లిం సోదరులపై పడకుండా, ఆ ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'హజ్ యాత్రికులకు అదనంగా అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుంది. ఈ నిర్ణయం వల్ల సుమారు 7 వేల మంది హజ్ యాత్రికులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ముస్లిం యాత్రికులకు ఈ నిర్ణయం ఎంతో ఉపశమనాన్ని ఇస్తుంది. ముస్లిం సోదరులకు ప్రభుత్వం అండగా ఉంటుంది' అని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రాష్ట్రంలోని హజ్ యాత్రికులు, మైనారిటీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బిజెపి విజయంపై విజయవాడలో సంబరాలు

### ఇది చారిత్రాత్మక విజయమన్న కేంద్రమంత్రి వర్మ

**విజయవాడ,మే4 :** పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపీ ఆధిక్యం కనబర్చడంపై విజయవాడలో ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలకు కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ స్వీట్లు తినిపించి సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపీ అధికారాన్ని నిలబెట్టుకోగా.. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయం చరిత్రాత్మకమన్నారు. అక్కడ కమ్యూనిస్టుల పాలనలో బీజేపీ నేతలపై దాడులు జరిగాయని విమర్శించారు. 2011లో ఒక్క ఎమ్మెల్యే లేకపోయినా.. 2021లో 70 స్థానాల్లో బీజేపీ విజయం సాధించిందని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు దాదాపు రెండు వందల స్థానాల్లో బీజేపీ విజయం దిశగా దూసుకెళ్తోందన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ.. అరాచకాలు, విధ్వంసకర ధోరణికి పాల్పడ్డారని, దేశ హితానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారని విమర్శించారు. బంగ్లాదేశ్ చొరబాటుదారుల వల్లే మమత గెలుస్తూ వచ్చారని అన్నారు. కేంద్రం నుంచి వచ్చే పథకాలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కేవలం సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి, రాష్ట్ర ప్రయోజనాల కన్నా తన స్వార్థం చూసుకున్నారని మమతా బెనర్జీపై కేంద్ర మంత్రి మండిపడ్డారు. పోలింగ్ రోజు కూడా అనేక దాడులు చేయించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని కేంద్ర మంత్రి తెలిపారు. వీటిని అధిగమించి అక్కడి ప్రజలు మమత కుట్రలను తిప్పి కొట్టారన్నారు. బీజేపీపై నమ్మకంతో దాదాపు 200 స్థానాల్లో విజయం కట్టబెట్టారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో చొరబాట్లను మమతా ప్రోత్సహించడం వల్లే గెలిచారంటూ తాము చెప్పిన మాటలే ఇప్పుడు నిజమని తేలాయన్నారు. బీజేపీ అక్కడ అధికారంలోకి వచ్చేందుకు ఎన్నో సంవత్సరాలుగా ప్రయత్నం చేస్తూనే ఉందన్నారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సొంత రాష్ట్రం వెస్ట్ బెంగాల్‌లో బీజేపీ జెండా రెపరెపలాటడటం ఆనందంగా ఉందన్నారు. దేశంలో ప్రజలకు ఒకే చట్టం, ఒకే జాతీయ పతాకం ఉండాలని 1951లో ఇదే వెస్ట్ బెంగాల్‌లో ఆయన ఉద్యమం చేశారని గుర్తుచేశారు. పార్టీ ఆవిర్భావం, శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సమయంలో వెస్ట్ బెంగాల్‌లో బీజేపీ విజయం సాధించడం గొప్ప విషయమని శ్రీనివాస వర్మ అన్నారు. భవిష్యత్తులో పశ్చిమ బెంగాల్ అభివృద్ధిలో దూసుకుపోతుందని స్పష్టం చేశారు. కేరళంలో బీజేపీ రెండు స్థానాలతో అసెంబ్లీలోకి అడుగు పెట్టబోతోందన్నారు. తమిళనాడులో స్టాలిన్ పార్టీ కూడా ఓటమి దిశగా పయనిస్తోందన్నారు. మహిళా బిల్లును వ్యతిరేకించిన వారికి ప్రజలు బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. డీలిమిటేషన్ వల్ల అన్యాయం జరుగుతుందని ప్రచారం చేసిన వారిని ప్రజలే ఓడించారన్నారు. బీజేపీకి విజయాన్ని అందించిన ప్రధాని మోదీ, అమిత్ షా, ఇతర నేతలు, కార్యకర్తలకు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ధన్యవాదాలు తెలియజేశారు.

## దళపతి విజయ్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు

**అమరావతి, మే4** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే అధినేత, దళపతి విజయ్ గెలుపొందడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. దళపతి విజయం సాధించడంపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. తమిళ ప్రజలకు సేవ చేసే దిశగా విజయ్ కృషి చేయాలని ఆకాంక్షించారు. అలాగే ఆ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని చంద్రబాబు కోరారు. 'తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో విజయ్‌కు లభించిన అద్భుత విజయం పట్ల వారికి నా అభినందనలు తెలియజేస్తున్నాను.

# ఇల్లందు 22వ వార్డులో తీరనున్న డ్రైనేజీ కష్టాలు

❑ ప్రజా సమస్యే ప్రాధాన్యంగా కౌన్సిలర్ శివ కిరణ్ అడుగులు





ఇల్లందు మే 03 (జన సంఘర్షణ)

పట్టణంలోని 22వ వార్డు కోర్ట్ ఏరియా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మార్గదర్శిని పాఠశాల ఎదురు నుండి మాజీ కౌన్సిలర్ ఆకుల అంజలి ఇంటి వరకు ఉన్న పాత డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి, ఏళ్ల తరబడి స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ సమస్య పరిష్కారానికి తక్షణమే నడుం బిగించారు. డ్రైనేజీ సామర్థ్యం తక్కువగా ఉండటంతో మురుగునీరు నిలిచిపోయి తీవ్రమైన దుర్వాసన వెదజల్లడమే కాకుండా, దోమల బెడదతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరగా, కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ వెంటనే స్పందించి మున్సిపల్ అధికారులతో చర్చించి ప్రత్యేక నిధుల మంజూరుకు కృషి చేశారు. దీని ఫలితంగా రూ. 2.20 లక్షల అంచనా వ్యయంతో 130 మీటర్ల పొడవున నూతన డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను సోమవారం కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ స్వయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు ప్రజల కష్టాలను తీర్చడమే తన మొదటి ప్రాధాన్యతని, అభివృద్ధి పనుల్లో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ పనుల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్‌లకు శివ కిరణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వార్డులోని ప్రతి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధిలో 22వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆయన హామీ ఇచ్చారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే మురుగునీటి నిల్వ సమస్య పూర్తిగా తొలిగిపోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అధికారులు ఏఈ నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ సమక్షంలో పనులు వేగవంతం చేయాలని కౌన్సిలర్ ఆదేశించారు. తమ సమస్యపై సానుకూలంగా స్పందించి, పనులు మొదలుపెట్టిన కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ చొరవపై వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతతో కూడిన పనులు త్వరగా పూర్తి చేసి తమకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# నీట్ - 2026 పరీక్ష కేంద్రాలలో బందొబస్త్ ఏర్పాట్లు పర్యవేక్షించిన సీపి

బోధన్: మే 04 జన సంఘర్షణ

నిజామాబాద్ జిల్లాలో నిర్వహించబడుతున్న నీట్ 2026 పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.ఎస్., స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజీ ( ఆటోనోమస్ ) హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ బ్లాక్ లోని పరీక్ష కేంద్రాని క్షుణ్ణంగా పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు విస్తృతమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్ష రాయడానికి వచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులను సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. అలాగే పరీక్షల నిబంధనలు కచ్చితంగా అమలు కావాలనే దృష్ట్యా, సెక్యూరిటీ చెక్‌లను కఠినంగా నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో సహకరిస్తుందని కమిషనర్ తెలిపారు. నగర ప్రజలు కూడా పోలీస్ శాఖకు సహకరించి పరీక్షల నిర్వహణ విజయవంతం కావడానికి తోడ్పడాలని కోరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామ్ మోహన్ రెడ్డి, అబ్సర్వర్స్ డాక్టర్ మహేందర్, డాక్టర్ ఘంటా చంద్రశేఖర్, నిజామాబాదు టౌన్ సిఐ శ్రీనివాస్ రాజ్, 3 టౌన్ ఎస్ఐ హరి బాబు తదితరులు గలరు.




# మొక్కజొన్న పంట దహనమైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

❑ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత

బోధన్ మే 04 జన సంఘర్షణ

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కనుగుట్టలో ప్రమాదవశాత్తు వంద ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట దహనం అవడంపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. పంట దహనమై నష్టపోయిన రైతులతో హైదరాబాద్ నుంచి కవిత ఫోన్ లో మాట్లాడి ఓదార్చారు. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, టీఆర్ఎస్ నాయకులు బానోత్ మౌనికతో కలిసి బాధిత రైతులతో ఫోన్‌లో మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులు ధైర్యంగా ఉండాలని.. పంట నష్టం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా ఒత్తిడి చేస్తామని ధైర్యం చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మొక్కజొన్న పంట దహనమై నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించాలని, పంటనష్టం అంచనా వేసి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



# హిందూ సమ్మేళనం ఆధ్వర్యంలో ఇల్లందులో భారీ బైక్ ర్యాలీ

❑ భగవాధ్వజం నీడన ఏకమైన హిందూ శక్తి




ఇల్లందు మే 04 (జన సంఘర్షణ)

మారుతున్న సామాజిక పరిస్థితుల్లో హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా, సమాజాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు ఇల్లందు పట్టణం సిద్ధమైంది. భరతమాత సేవలో ప్రతి హిందువు భాగస్వామి కావాలనే ఆశయంతో, ఈ నెల 5వ తేదీ (మంగళవారం) సాయంత్రం 5 గంటలకు స్థానిక జే.కే. సింగరేణి మైదానంలో భారీ 'హిందూ సమ్మేళనం' నిర్వహించనున్నారు. "గడప లోపల కులం - గడప దాటితే హిందువులం" అనే నినాదంతో హిందూ సమాజంలో చైతన్యాన్ని నింపి, దేశాన్ని విశ్వగురువుగా నిలపాలన్న ఉన్నత లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ చారిత్రాత్మక సమ్మేళనానికి అంతర్జాతీయ రామ్ నామ్ ధరి అఘోర మండలేశ్వర శివనాగస్వామి జీ విశిష్ట అతిథిగా విచ్చేసి భక్తులకు దిశా నిర్దేశం చేయనున్నారు. పులిగండ్ల మాధవరావు అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో, సద్గురు ఆశ్రమం వ్యవస్థాపకులు ప్రబోధానంద డాక్టర్ జి. వీరభద్రం గురూజీ తమ ఆశీర్వచనాలను అందించనున్నారు. అలాగే ముఖ్య వక్తగా ఆర్.ఎస్.ఎస్. విభాగ్ సహ సంఘచాలక్ ఫణిభట్ల రాజేశ్వర శాస్త్రి పాల్గొని, హిందూ ధర్మం ఎదుర్కొంటున్న సవాళ్లు, ఐక్యత ఆవశ్యకతపై ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమ ప్రచారంలో భాగంగా ఇల్లందు పట్టణంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ స్థానికుల్లో అమితాసక్తిని రేకెత్తించింది. పట్టణమంతా భారీ బ్యానర్లు, ఫ్లెక్సీలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నిర్వహణ సమితి సభ్యులు గడప గడపకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ, ప్రతి హిందూ కుటుంబం ఈ సమ్మేళనంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఐక్యతను చాటిచెప్పేలా నిర్వహించిన ఈ ర్యాలీ, సమ్మేళన విజయానికి బలమైన పునాది వేసింది. హిందూ సంస్కృతిని, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నిర్వాహకులు గుర్తు చేస్తున్నారు. సామాజిక ఐక్యతే ఆయుధంగా, ధర్మం వైపు అడుగులు వేయాలని కోరుతున్నారు. ఈ మేధో మథన సదస్సు కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, హిందూ బంధువులందరినీ ఒకే వేదికపైకి తెచ్చే ఒక గొప్ప సామాజిక ప్రయత్నమని వారు స్పష్టం చేస్తున్నారు. రేపు సాయంత్రం 5 గంటలకు సింగరేణి హైస్కూల్ గ్రౌండ్ (జే.కే. మైదానం) లో ప్రారంభమయ్యే ఈ మహత్తర కార్యానికి హిందూ బంధువులందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి తరలిరావాలని హిందూ సమ్మేళన నిర్వహణ సమితి పిలుపునిచ్చింది. ఈ సమ్మేళనాన్ని భారీ స్థాయిలో జయప్రదం చేయడం ద్వారా హిందువుల ఐక్యతను చాటిచెప్పాలని, 'జై శ్రీరామ్' నినాదంతో ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరుతున్నారు.

# తడిసిన ధాన్యాన్ని కొనాలి: ప్రజాపంథా రాస్తారోకో

కొమరారం మే 04 (జన సంఘర్షణ)



అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సాయంత్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొమరారంలో ఇల్లందు-గుండాల రహదారిపై సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో జాప్యం చేయడం, గన్నీ బ్యాగులు, లారీలు సకాలంలో ఏర్పాటు చేయకపోవడం వల్లే ఆదివారం కురిసిన వర్షానికి వరి, మొక్కజొన్న పంటలు తడిసి రైతులు తీవ్రంగా నష్టపోయారని నాయకులు నాయిని రాజు, సర్పంచ్ అజ్మీర బిచ్చ ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని సాకులు చెప్పకుండా మద్దతు ధరతో కొనుగోలు చేసి, నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బుర్ర వెంకన్న, కాంపాటి పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

# పురుగుల డబ్బాతో కలెక్టరేట్లోకి

❑ మహిళను అదుపులోకి తీసుకున్న పోలీసులు.



బోధన్ : మే 04 జన సంఘర్షణ

తన భూమి సమస్య పరిష్కారం కావడంలేదని బాధిత మహిళా కలెక్టరేట్ కార్యాలయంలోకి పురుగుల డబ్బాతో రావడం కలకలం రేపింది. ఈ సంఘటన సోమవారం ఉదయం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రజావాణిలో చోటుచేసుకుంది. మాక్లూరు మండలం డీకంపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళా తనకు సంబంధించిన భూ సమస్యను పరిష్కరించాలని గత కొంతకాలంగా కలెక్టరేట్ కు వచ్చిన న్యాయం జరగడం లేదని ఆరోపించింది. ఇందులో భాగంగానే అధికారుల ఎదుట తన గోడు వెళ్ళబోసుకొని, అప్పటికి సమస్త పరిష్కారం కాకపోతే ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఆత్మహత్యలో భాగంగా సోమవారం సమీకృత కలెక్టరేట్లోని ప్రజావాణికి వచ్చింది. తన వెంట ఆత్మహత్యకు సంబంధించిన పురుగుల డబ్బాతో రావడంతో అక్కడే బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు గుర్తించి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అయితే అప్పటికే కబోర్డ్‌లోని సెక్యూరిటీ సిబ్బందిని దాటుకొని డబ్బాతో మహిళ ప్రజావాణిలోకి రావడం సెక్యూరిటీ వైఫల్యానికి నిదర్శనంగానిలిచింది. నిజామాబాద్ రూరల్ పోలీసులు పురుగుల డబ్బాతో ప్రజావాణిలోకి వచ్చిన మహిళను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

# నాళేశ్వర్ రైతు వేదికలో రైతు వారోత్సవ కార్యక్రమం



బోధన్ మే 04 జన సంఘర్షణ

నవిపేట్ మండలం నాళేశ్వర్ గ్రామంలోని రైతు వేదిక నందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 90 రోజుల ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో బాగంగా ఈ రోజు నాళేశ్వర్ రైతు వేదిక నందు "రైతు వారోత్సవం" కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాగంగా వ్యవసాయ అధికారి (ఏఈవో) వసంత్ గారు రైతులకు పలు సలహాలు సూచనలు చేసారు,రైతులు తామ పోలంలోని మట్టిని నమూనా సేకరణ ప్రక్రియ ఏవిధంగా చేపట్టాలి,దానివల్ల కలిగే ప్రయోజనాలు ఏవిదంగా ఉంటాయో,ఏరువులు ఏ మోతాదులో వాడాలి,ఆలాగే వానకాలం,యాసంగి పంటకి ప్రభుత్వం ప్రతిపాదించిన ఎనిమిది రకాల వరి వంగడాలనే వాడాలని,ప్రతి ఓక్క రైతు సేంద్రియ వ్యవసాయం పైనే దృష్టి సారించాలని రైతులకు సూచించడం జరిగింది.నాళేశ్వర్ గ్రామనికి చేందిన కోందరి రైతుల మొక్క మట్టి నమూనాలను ల్యాబ్ తిసుకేల్లి పరిక్ష చేయించడం జరిగింది,కావూనా ఆట్టి మట్టి పరిక్ష పలితాల రిపోర్టును ఈ రోజు రైతులకు ఆందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఆదికారి(ఏఈవో) వసంత్,సోసైటి సేక్రేటరి రమేష్, గ్రామ సర్పంచ్ ఉపసర్పంచ్ ఆర్మూర్ లావణ్య శ్రీనివాస్ ,మాజి సోసైటి చైర్మన్ మగ్గరి హన్మండ్లు, పంచాయితి సేక్రేటరి ఆఖీల్, గ్రామ కమిటి సభ్యులు బోజారం, కోండయ్య, రైతులు చిన్నదోడ్డి ప్రవిణ్, పోతన్న, సంపత్, సిఆర్పిలు పౌన, ఆనిత, రైతులు నవిన్, సతీష్ గణేష్, రాజు, దశకాంత్, నవిన్, రాజేందర్, సాయిలు, పోశేట్టి, సాయినాథ్, సాయిల్ హేల్త్ వాలంటిర్స్ మహేష్, రాజు తదితరులు పాల్గోన్నారు.

# రైతు సంక్షేమం - నేల ఆరోగ్యం మన బాధ్యత

❑ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు నేల ఆరోగ్యం పెంపోదించాలి.

బోధన్: మే 04 జన సంఘర్షణ



తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన స్థానం రుద్రూర్ శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ సమన్వయంతో పద్గల్ రైతు వేదిక యందు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు రైతు వారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎం సాయి చరణ్, కీటక శాస్త్రవేత్త, రైతులు యూరియా సిఫారసు చేసిన మోతాదులోనే వినియోగించాలని, రసాయన మందుల్ని విచక్షణారహితంగా పిచికారి చేయకుండా, పురుగులు ఆర్థిక పరిమిత స్థాయిని దాటినప్పుడు ఆఖరి అస్త్రం గా రసాయన మందులు వినియోగించాలని సూచించారు. పంటల్లో సమర్థవంతం గా నీటి వినియోగం, గిరాకి ఉన్న రకాల సాగు గురించి చర్చించడం జరిగింది. బి. రాజు, మండల వ్యవసాయ అధికారి, రైతులు నేల ఆరోగ్య పరిరక్షణ చేయాలని, సమతుల్య ఎరువుల యాజమాన్యం చేపట్టాలని, సేంద్రియ పద్ధతులను ఉపయోగించి ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని సూచించారు, రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను అందచేశారు. నగేష్, విత్తన ధ్రువీకరణ అధికారి మాట్లాడుతూ నాణ్యమైన ధ్రువీకరించిన విత్తనాలను ఉపయోగించాలని, అందుబాటులో ఉన్నటువంటి ఆధునిక పద్ధతులను ఉపయోగిస్తూ పంటకి సేంద్రియ ఎరువులను అందిస్తూ రైతు ఎక్కువ దిగుబడి మరియు నికర ఆదాయం సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నరేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ -బి గంగాధర్, పి.ఎ.సి.ఎస్ మాజీ చైర్మన్ - కే. చిన్నరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి - సాయి రామ రాజు, సుస్థిర వ్యవసాయం సభ్యులు - భార్గవ్, శ్రీకాంత్, రైతులు గ్రామస్థులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ

మంగళవారం
05 మే 2026

# దళితులపై వేధింపులు నాగరిక సమాజానికే మచ్చ

❑ **జ్ఞాన సుందర్‌కు న్యాయం చేయాలి**

ఇల్లందు మే 04 (జన సంఘర్షణ)
ప్రజాస్వామ్య దేశంలో కుల వివక్ష లేని సమాజాన్ని నిర్మించుకోవాల్సిన తరుణంలో, ఇంకా దళితులపై వేధింపులు కొనసాగడం అత్యంత హేయమైన చర్య అని జాతీయ మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లందు పట్టణానికి చెందిన నాయకుడు పొలిమాటి జ్ఞాన సుందర్ ఎదుర్కొంటున్న మానసిక వేధింపులపై సోమవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నేతలు గళమెత్తారు. బాధితుడికి అండగా ఉండి, దోషులకు శిక్ష పడే వరకు విశ్రమించేది లేదని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు.

**నిర్లక్ష్యపు నీడలో న్యాయం: అగ్రవర్ణ అహంకారానికి అద్దం పడుతున్న ఘటన**

సమాజంలో అంతరాలు తొలగిపోయాయని మనం గొప్పలు చెప్పుకుంటున్న వేళ, ఇల్లందులో జ్ఞాన సుందర్ పట్ల జరుగుతున్న పరిణామాలు మనల్ని వెనక్కి నెట్టేస్తున్నాయి. పొరుగున ఉండేవారు అండగా ఉండాల్సింది పోయి, కులం పేరుతో వేధింపులకు గురిచేయడం, ఇంటి పరిసరాల్లోని వస్తువులను ధ్వంసం చేస్తూ మానసిక క్షోభకు గురిచేయడం సభ్య సమాజం తలదించుకోవాల్సిన విషయం. కేవలం అధికారం, సామాజిక బలం ఉందనే గర్వంతో ఒక వ్యక్తిని ఒంటరిని చేసి వేధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం.

**పోలీసుల నిమ్మకు నీరెత్తిన వైఖరి.. పెచ్చుమీరుతున్న అరాచకాలు**

బాధితుడు తన గోడును వెళ్లబోసుకుంటూ పోలీసుల గడప తొక్కినా, అధికారుల నుంచి ఆశించిన స్పందన కరువవ్వడం గమనార్హం. గత కొన్ని నెలలుగా ఫిర్యాదులు అందుతున్నా, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఖాకీల నిర్లక్ష్యమే వేధింపుదారులకు వరంగా మారి, వారు మరింత పెట్రేగిపోయేలా చేస్తోంది. రక్షణ కల్పించాల్సిన చట్టబద్ధమైన వ్యవస్థలు మౌనం వహిస్తే, సామాన్యుడు న్యాయం కోసం ఇంకెక్కడికి వెళ్లాలనే ప్రశ్న ఉదయిస్తోంది.




**న్యాయపోరాటానికి సిద్ధం.. అలుపెరగని ఉద్యమమే మార్గం**

ఈ అన్యాయంపై జాతీయ మాల మహానాడు రాష్ట్ర కమిటీ సీరియస్‌గా స్పందించింది. బాధితుడు జ్ఞాన సుందర్‌కు న్యాయం జరిగే వరకు ఉన్నత అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేస్తామని, అవసరమైతే పోలీస్ స్టేషన్ ముట్టడి వంటి ఉధృత కార్యక్రమాలు చేపడతామని నేతలు హెచ్చరించారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఒత్తిడి తీసుకురావడం ద్వారానే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అడ్డుకోవచ్చని వారు పిలుపునిచ్చారు. ఇది ఒక వ్యక్తి సమస్య కాదు, సామాజిక గౌరవానికి సంబంధించిన పోరాటం.

# అకాల వర్షం అన్నదాత ఆక్రందన

❑ **ఇల్లందు మండల రైతులను ఆదుకోవాలి**

ఇల్లందు మే 04 (జన సంఘర్షణ)
నిన్న మండల పరిధిలోని పలు గ్రామాల్లో కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను బీజేపీ మండల అధ్యక్షులు భట్టు రమేష్ పరిశీలించారు. ప్రకృతి కన్నెర్ర చేయడంతో నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం తక్షణమే ఎకరాకు రూ. 30 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట నష్టంపై అధికారులు సర్వే నిర్వహించి నివేదిక ఇవ్వకుంటే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.





**ప్రత్యేక కథనం: ఆకాశానికి చిల్లు.. రైతు కంటికి నీరు.. పాలకుల స్పందన ఏది?**

పచ్చని పొలాల్లో ఈదురు గాలుల బీభత్సం.. చెమటోడ్చి సాగు చేసిన పంట.. చేతికి అందివచ్చే తరుణంలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో ఇల్లందు మండల పరిసర గ్రామాల అన్నదాతలు కోలుకోలేని దెబ్బ తిన్నారు. సోమవారం కురిసిన అకాల వర్షం, భారీ ఈదురు గాలులు రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి. ఇల్లందు సమీప ప్రాంతాల్లో కళ్లముందే మామిడి కాయలు రాలిపోతుంటే, నిలువునా మొక్కజొన్న పంట నేలకొరుగుతుంటే ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు ఆక్రందిస్తున్నారు. అప్పులు తెచ్చి సాగు చేసిన పెట్టుబడి అకాల వర్షానికి ఆహుతి కావడంతో, ఆ అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతాంగం తల్లడిల్లుతోంది.

**అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన కరువు**

మండల పరిధిలో ఇంతటి భారీ నష్టం జరిగినా, యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయం. బాధితులను పరామర్శించి, పంట నష్టాన్ని అంచనా వేయాల్సిన వ్యవసాయ అధికారులు ఇప్పటికీ క్షేత్రస్థాయిలోకి వెళ్లకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టాల్సింది పోయి, కార్యాలయాల్లో కూర్చుని లెక్కలతో కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసం? అన్నదాతల కన్నీళ్లు తుడవని పాలన ఎవరి కోసం అనే ప్రశ్న ఇప్పుడు సర్వత్రా వినిపిస్తోంది.

**కౌలు రైతుల పరిస్థితి వర్ణనాతీతం**

ఈ విపత్తులో సొంత భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వేలాది రూపాయలు కౌలు చెల్లించి సాగు చేస్తే, చేతికి చిల్లిగవ్వ కూడా దక్కే పరిస్థితి లేకపోవడంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పెట్టిన పెట్టుబడి అంతా నేలపాలు కావడంతో, కనీసం కుటుంబం గడవడమే కష్టంగా మారే ప్రమాదం ఉంది. మామిడి తోటలు దెబ్బతినడంతో వచ్చే ఏడాది వరకు రైతుకు వేరే ఆదాయ మార్గం లేదు. ప్రభుత్వం కేవలం హామీలకే పరిమితం కాకుండా, తక్షణ ఆర్థిక సహాయాన్ని ప్రకటించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాలి.

**బీజేపీ హెచ్చరిక.. అలుపెరగని పోరాటం**


రైతుల పక్షాన బీజేపీ మండల నాయకత్వం గళమెత్తింది. దెబ్బతిన్న పొలాల్లో స్వయంగా పర్యటించిన భట్టు రమేష్, ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక బృందాలతో సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితమైతే ఊరుకునే ప్రసక్తే లేదని, రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బాధితులకు తక్షణమే ఇన్పుట్ సబ్సిడీ అందకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

**అన్నదాతను ఆదుకోవడమే అసలైన రాజధర్మం**

రైతు దేశానికి వెన్నెముక అని వేదికల మీద చెప్పడమే కాదు, ఆ వెన్నెముక విరిగినప్పుడు ఆదుకోవడమే అసలైన రాజధర్మం. అకాల వర్షం కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడంలో ఆలస్యం జరిగితే, అది వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపి, రాజకీయాలకు అతీతంగా ప్రతి రైతుకు నష్టపరిహారం అందించి వారి కన్నీళ్లు తుడవాలని సీనియర్ పాత్రికేయుల తరపున మేము సైతం ఆకాంక్షిస్తున్నాము. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందిస్తుందా? లేక అన్నదాతను అడవి పాలు చేస్తుందో వేచి చూడాలి.

## కొబ్బరి చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు

బోధన్ :మే :04 జన సంఘర్షణ
బోధన్‌లోని ఆచన్పల్లిలోని ఈవెంట్ ప్లాజా ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో సోమవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి కొబ్బరి చెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. బోధన్ మండలం బెల్లాల్ గ్రామానికి చెందిన తాహెర్ కొబ్బరి చెట్టు ఎక్కి కొబ్బరికాయలు కోసే క్రమంలో పట్టు తప్పి కిందపడ్డాడు. దీంతో స్థానికులు 108లో బోధన్ ఆసుపత్రికి తరలించారు.



## చించాల గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముధోల్, మే 4(జన సంఘర్షణ)
ముధోల్ మండలం చించాల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏపీఎం గురు చరణ్, ఏఈఓ రాణి, సీసీ జ్యోతి, వీవో అధ్యక్షురాలు రజిత, వీవోఏ లతా హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే గ్రామ సర్పంచ్ సర్వేష్, ఉప సర్పంచ్ పీసర సాయినాథ్ గౌడ్, గ్రామ రైతులు, వార్డు సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రైతులకు సకాలంలో మద్దతు ధర లభించేలా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా వడ్ల కొనుగోలు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రం ప్రారంభంతో గ్రామ రైతులకు ఎంతో ఉపయోగం కలుగుతుందని, పంటను సులభంగా అమ్ముకునే అవకాశం లభిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



# పాల్వంచలో 'చీకటి' రాజ్యం: రేపు విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడికి బిఆర్ఎస్ పిలుపు



పాల్వంచ మే 04 (జన సంఘర్షణ)
స్వరాష్ట్రంలో వెలుగులీనిన తెలంగాణ.. నేడు అప్రకటిత విద్యుత్ కోతలతో అంధకారంలోకి వెళ్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కిలారు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. పాల్వంచ పట్టణ, మండల వ్యాప్తంగా కొనసాగుతున్న విచక్షణారహిత కరెంటు కోతలను నిరసిస్తూ, రేపు (మే 5, మంగళవారం) ఉదయం 10 గంటలకు పాల్వంచ సబ్‌స్టేషన్ వద్ద మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు నాయకత్వంలో భారీ ధర్నా నిర్వహించనున్నారు. అభివృద్ధికి వెలుగులు అవసరమైన చోట, అధికార యంత్రాంగం నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయని, వ్యవసాయం కుంటుపడి రైతులు, దైనందిన పనులు సాగక సామాన్యులు పడుతున్న ఇబ్బందులకు ఈ నిరసనే సమాధానమని ఆయన పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి పాలకుల నిద్ర మత్తును వదలగొట్టాలని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# వెస్ట్‌బెంగాల్, అస్సాం పుదుచ్చేరిలో కాషాయ జెండా రెపరెపలు..

❑ **గాంధీనగర్ డివిజన్, అశోక్ నగర్‌లో సంబరాలు జరుపుకున్న ఎం.పీ రాజ్య సభ డా. కె లక్ష్మణ్**



హైదరాబాద్ సిటిబ్యూరో మే 4( జనసంఘర్షణ )
భారత రాజకీయ చరిత్రలో ఇది సరికొత్త సంచలనం. మోదీ నాయకత్వంలో బెంగాల్ లో బిజెపి జయభేరి మోగించి,అస్సాం పుదుచ్చేరిలో కాషాయ జెండా ఎగురవేసిన భారతీయ జనతా పార్టీ నాయకులకు కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షులు, రాజ్య సభ ఎంపీ డా. కె.లక్ష్మణ్ , సోమవారం గాంధీనగర్ డివిజన్ అశోక్ నగర్‌లోని వారి నివాసం వద్ద బిజెపి నాయకులతో కలిసి టపాసులు కాల్చి,స్వీట్లు తినిపించి బిజెపి విజయోత్సవ సంభారాలు నిర్వహించారు.కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భారత్ గౌడ్, బిజెపి సికింద్రబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బిజెవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ, స్థానికులు స్వామి రావు, రాజేష్, నాయకులు సురేష్ రాజు, ఆనంద్ రావు, జ్ఞానేశ్వర్, అరుణ్ కుమార్, ప్రశాంత్, శ్రవణ్, శక్తీసింగ్, లడ్డు, బిజెపి, బిజెవైఎం నాయకులు కార్యకర్తలు సంబరాల్లో పాల్గొన్నారు.

# ఇల్లందులో 'రెండు రాష్ట్రాల' నృత్య సంగ్రామం



ఇల్లందు మే 04 (జన సంఘర్షణ)
కళ అనేది మనిషి అంతరాల్లో నిగూఢంగా దాగి ఉన్న భావోద్వేగాల వ్యక్తీకరణ. మారుతున్న కాలంలో యువత తమ మూలాలను మర్చిపోకుండా, శారీరక, మానసిక వికాసానికి తోడ్పడే నృత్య కళను ప్రోత్సహించడం అభినందనీయం. కీర్తిశేషులు బాల, సాయి జ్ఞాపకార్థం వెంకట్ డాన్స్ అకాడమీ (వీడీఏ) ఆధ్వర్యంలో, వీబీసీసీ యూత్ సహకారంతో ఇల్లందులో నిర్వహించ తలపెట్టిన 'రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి డాన్స్ పోటీలు' ఈ దిశగా పడిన ఒక బలమైన అడుగు. మున్సిపల్ కార్యాలయంలో ఈ పోటీల గోడ పత్రికలను ఆవిష్కరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, కమిషనర్ శ్రీకాంత్ తదితర ప్రముఖులు అన్నట్టుగా, ఇలాంటి వేదికలు యువతలోని సృజనాత్మకతకు పదును పెట్టడమే కాకుండా, వారిలో క్రమశిక్షణను, ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి. కేవలం వినోదంగా మాత్రమే చూడకుండా, కళను ఒక వ్యక్తిత్వ వికాస సాధనంగా గుర్తించాల్సిన అవసరం నేటి సమాజానికి ఎంతో ఉంది. జూన్ 14న సీఈఆర్ క్లబ్ వేదికగా జరగనున్న ఈ మహాక్రతువులో వెస్ట్రన్, ఫోక్, క్లాసికల్ వంటి వైవిధ్యభరిత విభాగాల్లో పోటీలు నిర్వహించడం ద్వారా నిర్వాహకులు కడారి వెంకటేష్, సాయి మాస్టర్ అన్ని వర్గాల కళాకారులకు సమన్యాయం చేకూర్చారు. నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రతిభకు ఇచ్చే గౌరవ చిహ్నాలైతే, పాల్గొనే ప్రతి కళాకారుడికి కల్పించే భోజన వసతులు వారి పట్ల నిర్వాహకులకున్న నిబద్ధతను చాటిచెబుతున్నాయి. సీనియర్, జూనియర్ విభాగాల్లో సోలో, డ్యూయెట్ ప్రదర్శనలతో రెండు రాష్ట్రాల నుండి తరలివచ్చే కళాకారులు ఇల్లందు గడ్డపై తమ నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు. కళాకారుల శ్రమను గుర్తించి, వారిని ప్రోత్సహించడం ద్వారానే సమాజంలో సంస్కృతి వర్ధిల్లుతుందని, ఈ పోటీలను విజయవంతం చేయడం మనందరి బాధ్యతని ఈ కార్యక్రమం స్పష్టం చేస్తోంది.

## బిద్రెల్లి గ్రామంలో బిరప్ప కామారతీ కల్యాణ మహోత్సవం

❑ **పాల్గొన మాజీ ఎమ్మెల్యే**



బాసర, మే 4 (జన సంఘర్షణ)
బాసర మండలం బిద్రెల్లి గ్రామంలో నిర్వహించిన బిరప్ప కామారతీ కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ శాసన సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భోస్లే నారయణ రావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన బిరప్ప దేవుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న పలు గ్రామాల భక్తులకు స్వయంగా భోజనం వడ్డించి సేవ చేశారు. భక్తులతో మమేకమై వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిద్రెల్లి గ్రామానికి చెందిన కురుమ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే బాసర మండల అధ్యక్షుడు మంమై రమేశ్ గారు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర చంద్రే గారు, తానూర్ మాజీ ఎంఎంపీపీ చంద్రకాంత్, సాయినాథ్, అట్టల్ దేవిదాస్, జాదే శ్రీనివాస్, ఆత్మ కమిటీ డైరెక్టర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 10 ఫిర్యాదులు

ఎల్లారెడ్డి, మే -4(జన సంఘర్షణ )



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 10 దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీవో కార్యాలయం సిబ్బంది తెలిపారు. డివిజన్ పరిధిలోని రెవెన్యూ శాఖకు 4, మున్సిపల్ శాఖకు మూడు, ఎలక్ట్రిసిటీ శాఖకు ఒకటి పంచాయతీ రాజ్ శాఖకు 2 చొప్పున వినతులు ప్రజల నుంచి వచ్చాయని వీటి సత్వర పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆర్డీవో ప్రభాకర్ తెలిపారు. కాగా చాలా రోజుల తర్వాత ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు దరఖాస్తుల కోసం రాగ, డివిజన్ స్థాయిలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

## కోనేరు శశాంక్ అన్న మాతృమూర్తితో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సోంపూర్ పోచిరాం కలవడం జరిగింది

పొతంగల్/మే 4/(జన సంఘర్షణ)



పోతంగల్ మండల కేంద్రం కోనేరు శశాంక్ అన్నమాతృమూర్తితో పొతంగల్ మండల గ్రామం పీఎస్ఆర్ నగర్‌లో శివాలయం గుడి వద్ద కోనేరు శశాంక్ అన్న కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం వారు చేయడం అలాగే అన్నదానం అంటే నిస్వార్ధంగా ఆకలిని తీర్చి ఆశీర్వాదాలను పొందే ఒక మహత్తరమైన సేవ చేయడమే ఒక గొప్ప సంకల్పం. కావున అందులో భాగంగా కోనేరు శశాంక్ అన్న వారి అమ్మతో కుటుంబ సభ్యులకు హృదయపూర్వకంగా దేవుడు ఆశీస్సులు వారి ఎల్లప్పుడూ ఉండాలని శివుడిని కోరుకుంటు వారు ఏ పని చేసినా వారికి దేవుడు తోడుగా ఉంటూ వారి పైన ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో భగవంతుడు వారికి మంచి శక్తిని ఇస్తూ మరెన్నో కార్యక్రమాలు వారు నిర్వహించాలని దేవుడు వారికి మంచి శక్తిని అందించాలని కోరుకుంటూ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సోంపూర్ పోచిరాం మాదిగ జై ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నలకు సబ్సిడీ పథకాలు అందేలా కార్యచరణ చేపడతాం

◆ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగనేని

శ్రీకాళహస్తి మే 04 (జన సంఘర్షణ):



పట్టణంలో ఉన్న మార్కెట్ కమిటీ కార్యాలయం నందు మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు, రైతులు తమ సమస్యలు మార్కెట్ కమిటీ చైర్మన్ దృష్టికి తీసుకుని వెళ్ళగా ప్రభుత్వం దృష్టికి రైతన్నల సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కార్యాచరణ చేపడతానన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు మాట్లాడుతూ.. రైతన్నలకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా నేడు సమీక్ష సమావేశం నిర్వహించామని, గత టిడిపి ప్రభుత్వంలో రైతన్నలకు వారికి కావలసిన యూరియా జిప్సం లాంటి ఎరువులను సబ్సిడీకి ఇచ్చే వారిని అదేవిధంగా రైతన్నలు కావలసిన పనిముట్లు సామాగ్రిని కూడా సబ్సిడీకి ఇచ్చేవారని, అలాంటి సబ్సిడీ పథకాలు మళ్ళీ అమల్లోకి తీసుకురావాలని రైతుల కోరడంతో, రైతులు కోరిన కోరికలను ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లి రైతన్నలకు సబ్సిడీ పథకాలు అందేలా కార్యాచరణ చేపడతామన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేపట్టిన బడి పిలుస్తుంది ప్రచార రథయాత్ర శ్రీకాళహస్తినియోజకవర్గంలో అత్యంత వేడుకగా నిర్వహింపబడుతుందని, చిన్నారుల తల్లితండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ పాఠశాల బలోపితం చేసే విధంగా కార్యాచరణ చేపట్టాలని కోరారు.

## పనసా కాలవ..పక్కనే ఆక్రమణ

◆ నిర్మాణం చేపట్టిన కబ్జాదారుడు
◆ చోద్యం చూస్తున్న అధికారులు

తొట్టంబేడు మే 04 (జన సంఘర్షణ):



శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం తొట్టంబేడు పంచాయతీ పరిధిలో ఉన్న ఈదులగుంట ఎల్ఐసి కాలనీ మార్గంలో పోతున్న పనసా కాలవ పక్కనే స్థలాన్ని ఆక్రమణ చేసి ఏకంగా నిర్మాణం చేపట్టారు, అయినా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని, పంచాయతీ ప్రజలు వ్యక్తం చేశారు, మండలంలో పలుచోట్ల చెరువుల్లో ఆక్రమంగా బోర్లు వేయడం, గ్రామకంఠం, కాలవలు ఆక్రమణ చేయడం గేటు పెట్టడం తొట్టంబేడు మండలంలో జరుగుతున్న భూ కబ్జాదారుల వేటా... అయినా అధికారులు మాత్రం ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థం కావడం లేదని, స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా సంబంధిత జిల్లా శాఖ అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన ప్రభుత్వ గ్రామకంఠలను, చెరువులును కాలవలను, కాపాడి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# బోధన్ పట్టణంలో 'ఉల్లాస్ – అమ్మకు అక్షరమాల' కార్యక్రమంపై మహిళా సమాఖ్య సభ్యులకు శిక్షణ




బోధన్: మే 04 జన సంఘర్షణ

బోధన్ పట్టణంలోని సోమవారం రోజున ఉదయం మహిళా సమాఖ్య మెప్మా కార్యాలయంలో 'ఉల్లాస్ – అమ్మకు అక్షరమాల' వయోజన విద్య కార్యక్రమంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని మహిళా సమాఖ్య పదాదికారులకు, మెప్మా ఆర్ పీ లకు సి.ఆర్.పిల చేత శిక్షణ ఇవ్వడమైనది. అడల్ట్ ఎడ్యుకేషన్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.... చదువుకు వయస్సుతో సంబంధం లేదని, అక్షరాస్యత లేని ప్రతి మహిళను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే 'ఉల్లాస్' కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ముఖ్యంగా సంఘాల్లోని తల్లులు, వయోజన మహిళలు కనీసం తమ పేరు రాయడం, సంతకం చేయడం మరియు ప్రాథమిక గణితాన్ని నేర్చుకునేలా ఈ అక్షరమాల కార్యక్రమం రూపొందించబడిందని వివరించారు. సీఆర్పీలులు అనురాధ, వనిత వయోజన విద్య ప్రాముఖ్యత, సామాజిక అవశ్యకత గురించి తెలిపినారు. ప్రభుత్వ లక్ష్యం ప్రకారం వంద శాతం అక్షరాస్యత సాధించడంలో మహిళా సమాఖ్య సభ్యులు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ మహిళా సమాఖ్య పదాధికారులు , ఆర్పిలు మరియు మెప్మా టీఎంసీ, శ్రీనివాస్ సి ఓ, శ్రీనివాస్ పాల్గొన్నారు. తమ పరిధిలోని నిరక్షరాస్యులైన మహిళలందరినీ ఈ కార్యక్రమం ద్వారా విద్యావంతులను చేస్తామని సభ్యులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

# ప్రగతి దిశగా విజయ గాథ

◆ మోదీ నాయకత్వానికి ప్రజల మద్దతు: మోహన్ రావు పటేల్

భైంసా, మే 5(జన సంఘర్షణ)




పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి సాధించిన ఘన విజయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ విజయంపై మోహన్ రావు పటేల్ ప్రజా ట్రస్ట్ (భైంసా) చైర్మన్ మోహన్ రావు పటేల్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రినరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నాయకత్వంలో, హోం మంత్రి అమిత్ షా సూచనలతో ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకులకు, సోదర సోదరిమణులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజల విశ్వాసం, బీజేపీ పార్టీపై ఉన్న నమ్మకం ఈ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా ప్రతిబింబించిందని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డ ప్రతి కార్యకర్త కృషి ఫలితమే ఈ విజయం అని అన్నారు. భవిష్యత్తులో రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కూడా బీజేపీ పార్టీ జెండా ఎగురవేస్తూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఏసిబికి చిక్కిన జిహెచ్ఎంసీ జూనియర్ అసిస్టెంట్

◆ లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారి

జన సంఘర్షణ డెస్క్ మే: 04





హైదరాబాద్ జిహెచ్ ఎంసీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీలత ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయింది. ఓ ఇంటి నిర్మాణానికి సంబంధించి.. క్లియరెన్స్ అనుమతులు ఇచ్చేందుకు రూ. 5 లక్షల లంచం డిమాండ్ చేసింది. చివరకు లక్ష ఇస్తేనే క్లియరెన్స్ ఇస్తానని మొండికేసింది. దాంతో బాధితుడు ఏసిబికి ఫిర్యాదు చేయగా సోమవారం లక్ష రూపాయలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడింది.

# బోధన్ డివిజన్ టాపర్ పోతంగల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి వేదశ్రీ

◆ ప్రభుత్వ పాఠశాలలు పేదల పాలిట సరస్వతి నిలయాలు.. డాక్టర్ ఎం ఏ హకీమ్

కోటగిరి/ పోతంగల్ మే 4/(జన సంఘర్షణ)

పోతంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి 567 మార్కులతో బోధన్ డివిజన్ స్థాయి ప్రభుత్వ పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థిని వేదశ్రీ ని పేదల పెన్నిధి, సామాజిక సేవకులు డాక్టర్ ఎం ఏ హకీమ్ మండల విద్యా అధికారి శంకర్ ఆధ్వర్యంలో వేదశ్రీకి స్వీట్లు, శాలువా, పూలమాలలతో సత్కరించి విలువైన మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో సమాజ సేవకులు డాక్టర్ ఎంఏ హాకీం మాట్లాడుతూ ముందుగా అమ్మాయి చదువును గుర్తించి ప్రోత్సహించిన పాఠశాల ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి విద్యార్థి తనదైన శైలిలో ఉన్నత స్థానంలో ఉండాలని ఆలోచించుకొని ఒక దిశ నిర్దేశాన్ని ఏర్పాటు చేసుకొని చదువుకుంటే వారు అనుకున్న స్థాయికి చేరుకుంటారని ఇప్పటినుండి విద్యార్థినీ విద్యార్థులు భవిష్యత్తులో ఒక మంచి మార్గాన్ని ఎంచుకోవాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం మండలంలోని ఆరు ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి, ద్వితీయ,తృతీయ స్థానాల విద్యార్థులందరికీ, ఒక ప్రైవేట్ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర్, హంగర్గా




ఫారం మాజీ సర్పంచ్ ఏజాజ్ ఖాన్, జల్లా పల్లి ఫారం మాజీ సర్పంచ్ అమీనాభిషేరు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నేస్తమా మర్చిపోలేము నీ జ్ఞాపకాలు...

◆ ఆర్థిక సహాయం అందజేస్తున్న....బాధితుని మిత్రబృందం...

కోటగిరి/ పోతంగల్ మే 4/ (జన సంఘర్షణ)



కోటగిరి జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో 1991 వ సంవత్సరంలో పదవ తరగతి వరకు చదివిన మిత్రులు తమతో పాటు తమ పక్కనే కూర్చుని చదువుకొని అందరితో చనువుగా ఉంటూ పేదరికంలో ఉన్న కోటగిరికి చెందిన రుద్ర హనుమాండ్లు అనారోగ్య పరిస్థితుల రీత్యా మమ్మల్ని వదిలి తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోవడంతో కోటగిరి మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్ మాట్లాడుతూ తమతో పాటు చదివిన తన మిత్రుని కోసం అవసరమైతే చందాలు వేసుకొని బతికించుకుందామని తన తోటి మిత్రులతో మాట్లాడిన అనంతరం డాక్టర్లను సంప్రదించగా కోలుకోలేని పరిస్థితిలో ఉన్నాడని సమాధానం రావడంతో, చేసేదేమీ లేక అందరూ కలిసి ఆ కుటుంబానికి అండగా ఉంటామని ముందస్తుగా అంత్రక్రియలు ఏర్పాటుకు విధిగా డబ్బులు అందించి, ఆ కుటుంబానికి ఎప్పటికీ అండగా ఉంటామని, అందరూ కలిసి 50 వేల రూపాయలను మృతుని కుమారుడు, కుమార్తెలకు అందజేశారు. ఎక్కడో పుట్టి ఎక్కడో చదివి పదవ తరగతి వరకు కలిసి ఉన్న ఈ బంధం ఒక తీయని అనుభూతిగా మిగిలిపోయిందని నీవు లేవని, ఇక కానరావని మిత్రులందరు శోక తప్త హృదయాలతో పరితపించి పోయారు. ఏది ఏమైనా ఇలాంటి మిత్రులు ఉండడం సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇస్తుంది.

## విజయ్ విజయం సంబరాలు... పిచ్చాటూరు మండలం హనుమంతపురంలో వైఎస్ఆర్సిపి శ్రేణుల హర్షధ్వానాలు

**మే 04, జనసంఘర్షణ :** తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండలం పరిధిలో హనుమంతపురం గ్రామంలో నేడు విడుదలైన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఇళయ తలపతి విజయ్ ఘన విజయం సాధించి ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన సందర్భంగా హనుమంతపురంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా సంబరాలు నిర్వహించారు. హనుమంతపురం గ్రామం లోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున చేరుకున్న వారు టపాకాయలు పేల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయ్ అభిమానులు, పార్టీ శ్రేణులు "విజయ్ అన్న జిందాబాద్" అంటూ నినాదాలు చేస్తూ ప్రాంతాన్ని మారుమోగించారు. ఒక్కసారిగా గట్టిగా విజిల్స్ వేస్తూ, కేకలు పెడుతూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా జరిగిన ఈ సంబరాల్లో యువత ప్రత్యేకంగా పాల్గొని ఉత్సాహాన్ని చాటుకున్నారు. విజయ్ నాయకత్వంలో తమిళనాడు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, ఆయన పాలన ప్రజల ఆశలను నెరవేర్చాలని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ సంబరాలు హనుమంతపురంలో కొంతసేపు కొనసాగి ప్రజల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో విజయ్ అభిమానులు, గ్రామస్తులు పిల్లలు వైఎస్ఆర్సిపి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.



## కార్గిల్ యుద్ధం భారతదేశ శక్తిని చాటింది..

- భారత దేశ పౌరుల్లో స్ఫూర్తిని నింపింది
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, తిరుపతి జిల్లా కలెక్టర్ వేంకటేశ్వర్ల

**తిరుపతి మే4 జనసంఘర్షణ :** 1999వ సంవత్సరంలో జరిగిన కార్గిల్ యుద్ధం భారతదేశ శక్తిని చాటిందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలియజేశారు. అదే సమయంలో దేశ సార్వభౌమత్వాన్ని కాపాడిందని, భారతీయ పౌరుల్లో స్ఫూర్తిని నింపిందని గుర్తు చేసుకున్నారు.కార్గిల్ విజయ్ దివస్ 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, దేశంలో అత్యంత విజయవంతమైన ఆపరేషన్ "సిందూర్" స్ఫూర్తిని కొనసాగించాలనే సంకల్పంతో లెఫ్టినెంట్ జనరల్ వెంకటేశ రెడ్డి ఆధ్వర్యంలో 21 మంది వెటరన్స్ బృందం "విజయ అమృత్ కలశ్" యాత్రను చేపట్టారు. ఈ యాత్ర సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్కు చేరుకుంది. ఈ బృందానికి సాదర స్వాగతం పలికిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు..విజయ అమృత్ కలశ్ యాత్రకు శ్రీకారం చుట్టిన లెఫ్టినెంట్ జనరల్ వెంకటేశ రెడ్డి దేశ సేవను అభినందించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు వెటరన్స్ బృందంతో కలిసి కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమర వీరులకు నివాళులు అర్పించారు.అలాగే విజయ అమృత్ కలశాల పై పుష్పాలు సమర్పించి, అమరవీరులకు జోహార్లు అర్పించారు. సందర్భంగాఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ.. "కార్గిల్ యుద్ధం జరిగిన సమయంలో తనకు సుమారు 38 నుంచి 40 ఏళ్లు ఉండేవని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆ రోజుల్లో ప్రతిరోజూ రేడియోలలో ,పత్రికల్లో యుద్ధ విశేషాలను చాలా ఆసక్తిగా వినేవాడిని, చదివేవాడిని. అప్పటి యుద్ధం ఇప్పటిలా క్షిపణులు లేదా వైమానిక దళంతో కాకుండా, ప్రధానంగా భూమి పై సైనికుల మధ్య సాగిందని చెప్పారు.ఆ సమయంలో మన సైన్యం అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొందనీ,. పాకిస్థాన్ సైనికులు ఎత్తైన కొండ ప్రాంతాల్లో ఉండటం వల్ల వారు సులభంగా మన పై బాంబులువేయగలిగేవారనీ.అయితే మన సైనికులు కింద నుండి పైకి వెళ్తూ, పైన ఏం జరుగుతుందో స్పష్టంగా తెలియకపోయినా ప్రాణాలకు తెగించి పోరాడి విజయం సాధించారనీ అలనాటి స్మృతులను గుర్తు చేశారు. ఆ యుద్ధంలో బోఫోర్స్ గన్స్ మనకు గొప్ప విజయాన్ని అందించాయన్నారు. యుద్ధం వల్ల ప్రాణనష్టం , ఆయుధాల నష్టంఎక్కువగా జరిగినప్పటికీమన సైనికుల పట్టుదలతో భారతావనికి విజయం సాధించి, జాతీయ పతాకాన్ని ఎగురవేశారని తెలిపారు.సైన్యంలో ఉన్నవారికైనా లేదా రిటైర్డ్ సైనికులకైనా మనం తగిన గౌరవం ఇవ్వడం మన బాధ్యత అని చెప్పిన ఎంపీ దగ్గుమళ్ళప్రసాదరావు .సార్వభౌమత్వాన్ని కాపాడే సైనికులకు ఈ రోజుల్లో దక్కాల్సిన గౌరవం కొంత తగ్గుతోందని తాను భావిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో అవగాహనను మరియు గౌరవాన్ని పెంచుతాయనని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ యాత్ర జూలై 26, 2026 నాటికి విజయవంతంగా కార్గిల్ చేరుకోవాలని, ఇది దేశంలోని పౌరులందరిలో స్ఫూర్తిని నింపాలని తాను కోరుకుంటున్నానని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.."విజయ్ అమృత్ కలష్ యాత్రలో భాగమైనందుకు తనకు చాలా గర్వంగా సంతోషంగా ఉందన్నారు. కార్గిల్ యుద్ధం జరిగినప్పుడు తాను నాలుగో తరగతి చదువుతున్నానని గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో దేశం మొత్తం ఏకతాటిపైకి రావడం తనకు ఇప్పటికీ గుర్తుందని, కేవలం సాయుధ దళాలే కాకుండా, భారతదేశంలోని ప్రతి పౌరుడు అమరవీరులకు అండగా నిలిచి దేశభక్తిని చాటుకున్నారని చెప్పారు.కార్గిల్ యుద్ధం భారత సైన్యం పరాక్రమానికి, శక్తికి నిదర్శనంగా నిలిచిందన్నారు. యుద్ధం ప్రారంభంలో కొన్ని సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ, ఇది మన దేశానికి, సైన్యానికి లభించిన గొప్ప విజయమని కలెక్టర్ కొనియాడారు. ఆ యుద్ధానికి గుర్తుగా..రిటైర్డ్ ఆర్మీ వెటరన్స్ బృందం ఓ గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు.విజయ అమృత్ కలశ్" యాత్రను శ్రీ వేంకటేశ్వర స్వామి పాదాల చెంత చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుతో కలిసి ప్రారంభించడం తనకు గర్వకారణంగా ఉందన్నారు.



## వర్షంతో వాయిదా పడ్డ శ్రీ కల్యాణ వెంకటరమణ స్వామి పుష్పపల్లకి వేడుకలు

**బైరెడ్డిపల్లి జనసంఘర్షణ :** బైరెడ్డిపల్లి మండలం లోని బేలుపల్లి పంచాయితీ పట్నపల్లి లో వెలిసివున్న హస్తగిరి శ్రీ కళ్యాణవెంటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి 11 గంటలకు స్వామివారి కి పుష్పపల్లిక వేడుకలు జరగలిసి ఉండగా వర్షం ఎక్కువగా కురవడంతో వాయుధా పడింది అని ఆలయ ధర్మకర్త నారాయణ మొదలి పేర్కొన్నారు. ఈ బ్రహ్మోత్సవాలు లో పుష్ప పల్లకి వేడుకలు చాలా కీలకమై ఈ కార్యక్రమంకు పెద్ద సంఖ్యలో వివిధ ప్రాంతాల నుండి భక్తులు పోటెత్తారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భద్రత చర్యలు తీసుకోవడం ఆనవాయితీగా కొనసాగుతున్నది. ఈ పుష్పపల్లిక వేడుకలు మంగళవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ విషయం గుర్తించికోవాలని కోరారు.



## పీజీఆర్ఎస్ సమావేశంలో కీలక చర్చలు

**వరదయ్యపాలెం జనసంఘర్షణ :**



తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో తహసీల్దార్ సుధీర్తో.. టీడీపీ మండల అధ్యక్షుడు పి. యుగంధర్ రెడ్డి, వైసీపీ నాయకుడు టీ. దామోదర్ రెడ్డి పాల్గొని సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా భూ సమస్యలు, ఆదాయ ధృవీకరణ పత్రాలు, పింఛన్లు, రేషన్ కార్డులకు సంబంధించిన అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ప్రజలకు వేగంగా సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని నాయకులు అధికారులను కోరారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం కాకుండా చూడాలని సూచించారు. తహసీల్దార్ సుధీర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజలు పాల్గొని తమ వినతులు సమర్పించారు. అధికారులు సమస్యలను నమోదు చేసి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ వేదికగా నిలుస్తోందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ పార్టీలకు ప్రజల మద్దతు

- ఎమ్మెల్యే గురజాల జగన్

**చిత్తూరు మే 4జనసంఘర్షణ :** దేశంలోని ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ కూటమి పార్టీలకు ప్రజల మద్దతు లభిస్తోందని, ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మెజారిటీ విజయాలు ఎన్డీఏ కూటమి సాధించడం పట్ల చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ హర్ష వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్, అస్సోం, పుదుచ్చేరిలో ఎన్డీఏ కూటమి అద్భుత విజయాల సాధించడం.. ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని చెప్పారు. విజయాలు సాధించిన ఎన్డీఏ అభ్యర్థులను అభినందించారు.చిత్తూరు జిల్లాతో సరిహద్దులు పంచుకున్న తమిళనాడులో అత్యధిక స్థానాలు సాధించిన టీవీకే అధినేత విజయ్కు అభినందనలు తెలిపారు.



## కాణిపాకం వరసిద్ధిని సేవలో జిల్లా ఎస్పీ తుషార్ డ్యూటీ ఎమ్మెల్యే మురళీమోహన్

**కాణిపాకం మార్చి 4జనసంఘర్షణ :** పూతలపట్టు ఎమ్మెల్యే శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్ , చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి లు సోమ వారం కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని దర్శించు కున్నారు. వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం చైర్మన్ మణి నాయుడు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అనంతరం కాణిపాకం పోలీస్ స్టేషన్ ఆలయ పుష్కరణి అభివృద్ధిలో భాగంగా తొలగించుకున్న నేపథ్యంలో బస్టాండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్లో పరిశీలించి మార్పు చేయుటకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ, మరియు స్థానిక శాసనసభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐరాల జడ్పిటిసి సుచరిత, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు నరేష్, శివప్రసాద్, ఆలయ సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## కాణిపాకం నిత్య అన్నదాన ట్రస్ట్కి లక్ష విరాళం

**కాణిపాకం మే 4,జనసంఘర్షణ :** చెన్నైకి చెందిన శీను పొంగవనం కుటుంబ సభ్యులు కాణిపాకం నిత్యాన్నదాన ట్రస్ట్ కి నిత్య అన్నదాన ట్రస్ట్ కి లక్ష రూపాయలు విరాళం అందించారు. వీరికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, తదితరులు పాల్గొన్నారు.



## ఫతేనగర్ డివిజన్ పరిధిలో బిజెపి చేరిన మైనార్టీలు



**కూకట్పల్లి**

కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలో ఫతేనగర్ డివిజన్ సోమవారం బిజెపి పార్టీ లో చేరిన మైనారిటీ లు, మాజీ కార్పొరేటర్ ముద్దాపురం కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో మైనార్టీ సోదరులు సోదరీమణులు బిజెపిలో తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి కూకట్పల్లి ఇన్చార్జ్ కాంతారావు నేతృత్వంలో బిజెపి కార్యక్రమంలో పెద్ద ఎత్తున గౌతమ్ నగర్ నసిర్ బాయ్ అన్వర్ బాయ్ ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ మోడీ గారు చేసిన మంచి పనులను ఆకర్షితులపై బిజెపిలో చేరాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు బిజెపి నాయకులు యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసు పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్

**సుజాతనగర్ /ప్రజావారధి:**



సోమవారం నాడు 2025 అక్టోబర్ నెలలో సుజాతనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 498 కేజీల ఎండు గంజాయి కలిగిన లారీ కంటైనర్ పట్టుకొని ఇద్దరు నిందితులైన జగదీష్, దయారాం, పాటిల్ లారీ డ్రైవర్ సంజు కుమార్, లను సుజాతనగర్ పోలీసు పట్టుకుని రిమాండ్కు పంపించడం జరిగింది. ఇట్టి పరారీలో ఉన్న గంజాయిని ఒడిస్సా రాష్ట్రంలోని జైపూర్ చెందిన వ్యక్తి వద్ద నుండి కొని నారీ కంటైనర్ లో పెట్టి తరలించన మూడవ ముద్దాయి అయిన మహారాష్ట్ర కు చెందిన అమిత్ రోహిదాస్ పాటిల్, అను వ్యక్తిని సోమవారం సుజాతనగర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రమాదేవి, పట్టుకొని, కేసు దర్యాప్తు అధికారి చుంచుపల్లి సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, రిమాండ్ కు తరలించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను కొనడం, అమ్మడం, కలిగి ఉండడం, తాగడం, ట్రాన్స్పోర్ట్ చేయడం చట్టరీత్యా నేరం. అట్టి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## శ్రీశైలంలో స్వామివారిని దర్శించుకున్న కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కూకట్ పల్లి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీశైలం ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలం శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కృష్ణారావుతో పాటు పలువురు ప్రముఖులు, అనుచరులు కూడా స్వామివారి దర్శనానికి విచ్చేశారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు దేవస్థానం అధికారులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు శేషవస్త్రం, లడ్డు ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, కూకట్పల్లి నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

## బిసి డెవలప్మెంట్ ఆఫీసర్ గా పదవి విరమణ పొందిన వెంకటేశ్వర్లుని సన్మానించిన జిల్లా గణేష్ నేత



**కూకట్ పల్లి :**

శేరిలింగంపల్లి నియోజకవర్గం అల్విన్ కాలనీ పద్మశాలి సంఘం సలహాదారుడు సోదరుడు బిజ్జ వెంకటేశ్వర్లు మేడ్చల్ డిస్టిక్ బిసి దేవేలప్మెంట్ ఆఫీసర్ గా పదవి విరమణ పొందిన సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత ఆయనను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందబంగా వారు మాట్లాడుతూ బిజ్జ వెంకటేశ్వర్లు పదవిలో ఉంటకాలం తనవంతు బాధ్యతగా బిసి బిడ్డలకు సహాయ సహకారాలు అందించడం జరిగిందని వారిని ఈ సందబంగా గౌరవంగా పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహిచడం ఈ సందర్భంగా వారిని పద్మశాలి సంఘ సభ్యులతోపాటు పాల్గొన్న వారిని సన్మానించుకోవడం ఆనందంగా వుందన్నారు.

# ప్రైవేట్ యూనివర్సిటీల లబ్ధి కోసమే కోసమే జీవో7

- బడుగులకు ఉన్నతవిద్య దూరంచేసే కుట్ర
- బిఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశ్వంత్ కుమార్ ధ్వజం
- విద్యాభరోసా కార్డు అనులు చేయాలని డిమాండ్

**కూకట్ పల్లి :**

ప్రైవేట్ యూనివర్సిటీల లబ్ది కోసమే రేవంత్రెడ్డి సర్కార్ జీవో 7ను తీసుకొచ్చిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వంత్ కుమార్ ఒక ప్రకటనలో ఆరోపించారు. యూనివ ర్సిటీల గుర్తింపుతో (అఫిలియేషన్తో) నడిచే కాలే జీలు మూతపడటమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ వర్గాలతోపాటు దివ్యాంగులకు ఉన్నత విద్యసు దూరం చేయాలని రేవంత్ సర్కార్ కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు.



సర్కార్ వైఖరితో ఉన్నత విద్యకు బడుగు వర్గాలు దూరముపుతా యని, ఉన్నత వర్గాలే ఉన్నత విద్యను అభ్యసిస్తా యని ధ్వజమెత్తారు. టీవో 7 ద్వారా దీబీటీ పద్ధతిలో ఏ నెలలో ఎంత శాతం ఫీజులు చెల్లిస్తారో స్పష్టత లేక విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రని పేర్కొన్నారు. ఈ డీబీటీ విధానంలో విద్యార్థులు నుంచి ఫీజు వసూలు చేయవద్దని ప్రభుత్వ ఆదేశాలను కాలేజ్ యాజమాన్యాలు పాటించే పరిస్థితి ఉండదని తెలిపారు. కేవలం ఫీజులు చెల్లించిన విద్యార్థులకే అడ్మిషన్లు ఖరారు చేసే పరిస్థితి ఉంటుందని తెలిపారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసానికి దూరమవుతారని వ్యక్తంచేశారు. ఆందోళన కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన 5 లక్షల విద్యాభరోసా కార్డు పథకాన్ని అమలు వేయాలని డిమాండ్ చేశారు.

# రైతుల రక్తం తాగుతున్న రాబందుల రాజ్యం..

- చేతకాకపోతే గద్దె దిగండి....!
- ధాన్యాన్ని కొనుగోలు చెయ్యకపోతే రైతులతో కలిసి ఆందోళన చేస్తాం....
- అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు...

**చంద్రుగొండ :**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి కాదు.. దళారుల తొత్తు చేతకాని దద్దమ్మ పాలనలో రైతులు నడిరోడ్డుపై అల్లాడుతున్నారు. వెంటనే నియోజకవర్గ వ్యాప్తంగా ధాన్యం కొనకపోతే ఆందోళన చేస్తామని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు, నిప్పులు చెరిగారు. చంద్రుగొండ(మండలం), దామరచర్ల ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద పేరుకుపోయిన ధాన్యపు రాశులను చూసి ఆయన ఆగ్రహించారు. అక్కడి రైతుల గోడు విన్న మెచ్చా నాగేశ్వరరావు, కాంగ్రెస్ సర్కార్పై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి మాయ మాటలకు బలైపోయి రైతులు నేడు కన్నీరు పెడుతున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్, హయాంలో ధాన్యం గింజ కూడా బయట పడకుండా కొనుగోలు చేసిన రోజులను గుర్తుచేసుకోండి. నేడు రైతుల కష్టం రాబందుల పాలవుతుంటే ఈ ప్రభుత్వానికి కళ్ళు



కనబడటం లేదా? అధికారులకు చెవులు పనిచేయడం లేదా? అని ఘాటుగా ప్రశ్నించారు. రైతుబంధును ఎగ్గొట్టి, రైతుబీమాను పాతాళానికి తొక్కి, ఇప్పుడు పండించిన పంటను కూడా కొనకుండా రైతుల నోట్లో మట్టి కొడుతున్నారని మండిపడ్డారు. ఇంత అసమర్థ పాలన అవసరమా? రైతులకు న్యాయం చేయడం చేతకాకపోతే తక్షణమే రాజీనామా చేసి తప్పుకోండి. మళ్ళీ కేసీఆర్ కి అధికారం అప్పగిస్తే నెల రోజుల్లోనే ఈ గందరగోళాన్ని చక్కదిద్ది రాష్ట్రాన్ని సుభిక్షం చేస్తారు. అని హెచ్చరించారు. రైతులు ఆకలితో అలమటిస్తుంటే ప్రభుత్వం దళారులకు కొమ్ముకాయడం సిగ్గుచేటని, తక్షణమే కొనుగోలు ప్రక్రియ మొదలుపెట్టకపోతే బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున యుద్ధం ప్రకటిస్తామని, ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రైతులు తమ ఆవేదనను



వ్యక్తం చేస్తూ కష్టపడి పండించిన పంటను కాపాడుకోలేక చస్తున్నాం, ఈ ప్రభుత్వంలో మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేడు అని రోదించారు. అన్నదాతల కన్నీటి శాపం ఈ ప్రభుత్వానికి తగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి వెంకట రెడ్డి, మండల బి ఆర్ ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు దారా బాబు, సర్పంచ్లు ఇర్ప స్రవంతి, కొండెం కృష్ణ వేణీ, ప్రవీణ్ ప్రకాశ్, ఉప సర్పంచ్ బాలు నాయక్, శ్రవణ్, మాజీ సర్పంచ్లు భూపతి రమేష్, అంజన్ రావు, మెడ మోహన్ రావు, నల్లమోతు వెంకట నారాయణ, సురా వెంకటేశ్వర్లు, వెంకట రత్నం, బీరకాయల వెంకటేశ్వరావు, దానికా మల్లేష్, ప్రసాద్, నరసింహా రావు, లక్ష్మణ్ రావు, భూపతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నేల పరీక్షలతోనే లాభదాయకమైన సాగు సాధ్యం...

- శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తేనే రైతులకు అధిక దిగుబడి, ఆదాయశీ
- అవసరానికి మించి రసాయనాలు వాడి భూమి ఆరోగ్యాన్ని దెబ్బతీయొద్దు....
- మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలనే వేయాలి....
- యువత వ్యవసాయ రంగంపై ఆసక్తి పెంచుకుని దేశానికి వెన్నుముకగా నిలవాలి...
- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు




**చుంచుపల్లి :**

నేల పరీక్షలతోనే లాభదాయకమైన సాగు సాధ్యమవుతుందని, ప్రతి రైతు తన భూమి స్వభావాన్ని తెలుసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయాలని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా చుంచుపల్లి మండల పరిధిలోని ఎస్సీబీ నగర్ రైతు వేదికలో సోమవారం నిర్వహించిన "రైతు మహోత్సవం – రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాస్త్రవేత్తలతో చర్చించి భూమిలోని ఖనిజాల స్థితి, పీహెచ్ విలువలు, నేల స్వభావం వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రైతు ఉద్దేశించి మాట్లాడుతూ... మనిషికి రక్తపరీక్షలు ఎంత అవసరమో, భూమికి కూడా పరీక్షలు చేసి దాని ఆరోగ్యాన్ని కాపాడటం అంతే ముఖ్యమని వివరించారు. భూమికి అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకుంటేనే రైతులకు కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుందన్నారు. సాగు ఖర్చులను తగ్గించుకోవాలని, ముఖ్యంగా అవసరానికి మించి యూరియా, ఇతర రసాయనాల వినియోగాన్ని పరిమితం చేయాలని సూచించారు. మార్కెట్లో ఏ పంటకు డిమాండ్ ఉందో గమనించి అవే పంటలు సాగు చేయాలని, సాగునీటిని ఆదా చేస్తూ భవిష్యత్తు తరాలకు అందించాలని కోరారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా ప్రకృతిని కాపాడుతూ నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించవచ్చని తెలిపారు. ఏడు రోజుల పాటు సాగే ఈ అవగాహన కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత మరింత పెరుగుతుందని, రైతుల పిల్లలు కూడా ఈ వృత్తిపై మక్కువ పెంచుకుని ఆధునిక పద్ధతులతో దేశ ఆర్థిక వ్యవస్థను




బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. శాస్త్రం తోడైతేనే రైతు భవిష్యత్తు బలంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ గణేష్ చౌహన్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితా కుమారి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రభుత్వ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ డీసీసీ కార్యవర్గ సభ్యునిగా మామిండ్ల సురేష్ నియామకం

**హనుమకొండ;**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బి. మహేష్ కుమార్ గౌడ్ ఎంఎల్సీ ఉత్తర్వుల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరి, కార్యవర్గ సభ్యుల నియామకాలు ఖరారయ్యాయి. ఈ నియామకాల్లో భాగంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎంగల వెంకట్ రాం రెడ్డితో సంప్రదించి ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి రావాలని పీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 31వ డివిజన్ న్యూ శాయంపేట కు చెందిన మామిండ్ల సురేష్కు జిల్లా కార్యవర్గ సభ్యునిగా అవకాశం దక్కింది.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
మంగళవారం
05 మే 2026

# వడ్ల కొనుగోలు నిబంధనలు రైతులపై ఉక్కుపాదం..

- కలెక్టర్ ఆదేశాలు వెంటనే వెనక్కి తీసుక్కోలి....
- ప్రతి గింజను ప్రభుత్వమే కొనాలి సిపిఎం రైతు సంఘం డిమాండ్...
- తాలు లేకుండా వడ్లు పండించమంటారా? అసాధ్యానికి నిబంధనలు ఎందుకు....?
- రైతులపై అన్యాయం కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకో ఉద్యమం తప్పదు.....
- వడ్ల కల్లాలలో ఒక్క గింజ లేకుండా తక్షణమే ప్రభుత్వం చర్యలు చేపట్టాలి





**సుజాతనగర్ :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా వడ్ల కొనుగోలు ప్రక్రియలో ఏర్పడిన తాజా పరిణామాలు రైతుల్లో తీవ్ర అసంతృప్తి, ఆందోళనను రేకెత్తిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ మండల అగ్రికల్చర్ అధికారులకు జారీ చేసిన కఠిన నాణ్యత ప్రమాణాల ఆదేశాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని రైతు సంఘాలు, సిపిఎం పార్టీ నాయకులు స్పష్టమైన వైఖరితో డిమాండ్ చేస్తున్నారు. రైతుల కష్టానికి విలువ ఇవ్వకుండా, అమలు చేయలేని నిబంధనలు పెట్టి ధాన్యం కొనుగోలు నిరాకరించడం రైతులను నష్టాల్లోకి నెట్టే చర్యగా వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు.సుజాతనగర్ మండలంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అధికారుల బృందం, కలెక్టర్ ఆదేశాలను అమలు చేస్తూ "నాణ్యత ప్రమాణాలు ఉన్న వడ్లను మాత్రమే కొనుగోలు చేస్తాం" అని వెల్లడించడం రైతుల్లో మరింత ఆగ్రహానికి దారి తీసింది. పొలాల్లో పండే ధాన్యంలో కొంతమేర తాలు, చెత్త, మట్టి కలగడం సహజమని, ప్రకృతి పరిస్థితుల్లో పూర్తిగా శు భ్రమైన వడ్లు ఉత్పత్తి చేయడం అసాధ్యమని రైతులు చెబుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో కఠిన ప్రమాణాలు పెట్టి ధాన్యాన్ని తిరస్కరించడం రైతులపై అన్యాయం చేయడమేనని వారు స్పష్టం చేస్తున్నారు.ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, కూలీ ఖర్చులు పెరిగి రైతులు అప్పుల భారంలో కూరుకుపోయిన నేపథ్యంలో, వడ్ల కొనుగోలు ప్రక్రియలో ఇలాంటి నిబంధనలు అమలు చేయడం వారి పరిస్థితిని మరింత దిగజార్చుతుందని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభించకపోతే రైతులు ఆర్థికంగా పూర్తిగా కుంగిపోతారని, ప్రభుత్వం ఈ విషయాన్ని గంభీరంగా పరిగణించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.సిపిఎం పార్టీ రైతు సంఘం జిల్లా కమిటీ నాయకులు నల్ల గోపు పుల్లయ్య జిల్లా కమిటీ నాయకులు కలెక్టర్ ఆదేశాలపై ఘాటు విమర్శలు గుప్పిస్తూ, రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం అధికారుల ద్వారా కఠిన నిబంధనలు పెట్టి కొర్రీలు పెడుతోందని ఆరోపించారు. గత సంవత్సరంలో కూడా ఇలాంటి విధానాలతో రైతులను ఇబ్బందులకు గురి చేసిన విషయం గుర్తు చేస్తూ, ఈసారి కూడా అదే పద్ధతి కొనసాగించడం పూర్తిగా అన్యాయమని అన్నారు. రైతుల శ్రమను గౌరవించకుండా వ్యవహరించడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తుందని వారు విమర్శించారు.రైతు సంఘాలు, సిపిఎం పార్టీ కలిసి ప్రభుత్వానికి స్పష్టమైన డిమాండ్లు ఉంచాయి. కలెక్టర్ జారీ చేసిన ఆదేశాలను వెంటనే రద్దు చేయాలని, ప్రతి రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధరతో పాటు అదనంగా బోనస్ ప్రకటించాలని వారు కోరుతున్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు ఆలస్యం లేకుండా రైతుల బ్యాంకు ఖాతాల్లో వెంటనే జమ చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో పారదర్శక విధానం అమలు చేయాలని వారు స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను వెంటనే వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని రైతులు హెచ్చరించారు. రాస్తారోకో, ధర్నాలు, నిరసన కార్యక్రమాలతో ప్రభుత్వాన్ని ఎదిరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. రైతు కష్టానికి విలువ ఇవ్వకపోతే మౌనంగా ఉండబోమని, ప్రతి రైతు రోడ్డెక్కే పరిస్థితి వస్తుందని వారు పేర్కొన్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద ఇప్పటికే ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. రైతులు గుంపులుగా చేరి అధికారులను ప్రశ్నిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. పండించిన పంటను కొనుగోలు చేయకపోతే బ్యాంకు రుణాలు ఎలా తీర్చాలి, కుటుంబాన్ని ఎలా పోషించాలి అనే ఆవేదన రైతుల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు.రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడం ప్రభుత్వ ధర్మమని, రైతు ఆనందంగా ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని రైతు సంఘం నాయకులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకునే నిర్ణయం రైతుల భవిష్యత్తును నిర్ణయించనుంది. రైతుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకొని తక్షణ చర్యలు తీసుకుంటుందా లేక ఉద్యమాలు ఉధృతమవుతాయా అన్నది ఇప్పుడు జిల్లా ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది.

## ఉత్తమ విద్యార్థులకు సత్కారం



**రాజాపేట, మే 4 :**
రాజాపేట పట్టణ కేంద్రంలో ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఎస్ ఎస్ సి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యులకు, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులని సర్పంచ్ కోయ మధు ,ఉపసర్పంచ్ నమిలే కేదారి,వార్డు సభ్యులు సోమవారం అభినందనలు తెలియజేస్తు సత్కరించారు. ఈ కార్యక్రమములో సర్పంచ్ కోయ మధు పాఠశాల హెచ్ఎం ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ముందు ముందు ఇంకా మరిన్ని విజయాలు సాధించాలని తెలిపారు.

## నేతన్నకు ఆరోగ్య భద్రత క్యాంపు....

**వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్...**

**రాజాపేట మే 4 /ప్రజావారధి:**



నేతన్నకు ఆరోగ్య భద్రత ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం రాజాపేట మండలంలోని రఘునాథపురం గ్రామము లో చేనేత కార్మికులకు ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ ప్రారంభించారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజిషియాన్, ఆర్థో, కంటి పరీక్షలు నిర్వహిశీచారు. సుమారు 99 మంది చేనేత కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు ఈ శిబిరమును జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వంశీ కృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమములో మండల వైద్యాధికారి డాక్టర్ మోస్సెస్ రాజ్, జనరల్ ఫిజీషియన్, డాక్టర్ కిరణ్ ఆర్థోపెడిక్, డాక్టర్ నబీలా ఆప్తమాలజిస్ట్, సూపర్వైజర్ విజయలక్ష్మి , చైతన్య, మానస, ఉషారాణి హెల్త్ అసిస్టెంట్ ఉపేందర్, కవిత , టీబి సూపర్ వైసర్ జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ నటేష్, ఎక్సరే టెక్నీషియన్ ఉమేష్ మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 2005 -2006 ఎస్ ఎస్ సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం






**అన్నపురెడ్డిపల్లి :**
ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎర్రగుంట నందు 2005 -2006 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆనాటి ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని గురువులను ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడిన వక్తలు, అందరు కూడా క్రమశిక్షణగా ఉండి జీవితంలో ఉన్నత శిఖరాల అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ప్రధానోపాధ్యాయులు పి వెంకటరామయ్య, ఉపాధ్యాయులు అప్పారావు ,సైదయ్య ,ఎన్ సి హెచ్ ఆచార్యులు, నరసయ్య, కృష్ణ, విశాలాక్ష్మి, వివేక ,వెంకటేశ్వర్లు, విక్రమ్, బుచ్చిబాబు, కృష్ణయ్య ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్ కుమార్, ఆనాటి విద్యార్థులు అందరూ పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ మోదీ నాయకత్వానికి ఇది ఘనమైన గుర్తింపు

**బిజెపి మండల అధ్యక్షులు కోడె రమేశ్**

**రాజన్న సిరిసిల్ల జిల్లా/గంభీరావుపేట/మే4**



మూడు రాష్ట్రాల్లో జెండా ఎగురవేసిన భారతీయ జనతా పార్టీకి ఇది సాధారణ విజయం కాదు ప్రజల విశ్వాసానికి ప్రతీక ప్రజల ఆశీస్సుల తో,అభివృద్ధి పథంలో ముందుకు నడి పించిన నరేంద్ర మోడీ నాయకత్వానికి ఇది ఘనమైన గుర్తిం పు.ఇది గెలుపు మాత్రమే కాదు ఇది అభివృద్ధి పై ప్రజల తీర్పు,ఇది దేశభక్తి పై ప్రజల నమ్మకం ఈ గెలుపు ప్రతి కార్యకర్త శ్రమకు ఫలితం,ప్రతి ఓటు వెనుక ఉన్న విశ్వాసానికి గౌరవం! రానున్న రోజులలో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ఆశ భావాన్ని వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో రైతుల అష్ట కష్టాలను పట్టిం చుకోని కాంగ్రెస్ ప్రభుత్వం! ధాన్యం కొనుగోలు పేరుతో రైతు లను మోసం చేస్తూ,రైతుల కష్టాలను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం!ధాన్యం కొనుగోలు పేరుతో రైతులను మోసం చేస్తూ,మాటలు ఎక్కువ పనులు శూన్యం!ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ,రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రైతులు సరైన గుణపాఠం చెప్పే సమయం త్వరలోనే ఆసన్నమైతదని.రైతు వ్యతిరేక విధానాలు ఇక చాలు! కాంగ్రెస్ వైఫల్యాలకు ముగింపు పలకాలి ఇక దేశవ్యాప్తంగా ఇదే జోష్,ఇదే స్ఫూర్తితో భారత్లో భవిష్యత్తు మళ్లీ బీజేపీ దేఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దేవ సాని కృష్ణ.సర్పంచ్ లు పొన్నాల మహేష్.బండ సుకన్య. దేవయ్య.సీనియర్ నాయకులు రాజు గౌడ్.డాక్టర్ సత్యనా రాయణ.సర్వోత్తమ్. శ్రీనివాస్. రవీందర్.కృష్ణ కాంత్ యదవ్. శ్రీనివాస్.దేవేందర్ యాదవ్.చంద్రం యాదవ్.రమేష్.పుల్యా నాయక్.దేవా గౌడ్.మహేష్ యాదవ్. దేవరాజు.నాయకులు పాల్గొన్నారు

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co